క్లుప్తంగా

అకాడతో ఆత్మవిశ్వాసం



శిక్షణను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్

జ్యోతినగర్: అకాడతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రామగుండం డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు అన్నారు. అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్ ఆవరణలో బుధవారం శ్రీహనుమాన్ అకాడ శిక్షణను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఉచితంగా అకాడ శిక్షణ అందిస్తున్న కంది నాగరాజును అభినందించారు. కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, రమణారెడ్డి, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, కంది చంద్రయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం



ఓటర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

జూలపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో సమగ్రాభివృద్ధి సాధించి బంగారు తెలంగాణ చేయడం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌తో పాటు అనుబంధ గ్రామాలైన సిల్లోనిపల్లె, ద్యావన్‌పల్లె గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో గ్రామశాఖ అధ్యక్షుడు గంగయ్య, శ్రీనివాస్, అరుణ్, రాంగోపాల్‌రెడ్డి, తొగరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి ఐసీటీసీ సిబ్బంది ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన శిబిరం, ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ పాల్గొని స్థానికులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా, కేఎఫ్‌టీ లాజిస్టిక్స్ కంపెనీ సిబ్బందికి రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. పెద్దపల్లి, కరీంనగర్ నోడల్ ఆఫీసర్ నర్సింహారెడ్డి, డీపీఎం సురేందర్‌రెడ్డి, టోల్‌ప్లాజా మేనేజర్లు యగ్నేశ్వరరావు, రామకృష్ణ, కన్నాబాబు, అసిస్టెంట్ మేనేజర్లు నవీన్‌కుమార్, రమేశ్, స్వామి, పీఆర్‌వో హన్మకొండ రాము, పెద్దపల్లి జిల్లా ఐసీటీసీ, బసంత్‌నగర్ పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పీవైఎల్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: ఎన్టీపీసీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) 8వ రాష్ట్ర మహాసభలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం పీవైఎల్ ప్రతినిధులు అంతర్గాం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, నాయకుడు ఆడెపు శంకర్, మార్త రాములు, కోడిపుంజుల మహిపాల్, రాయమల్లు, మల్లయ్య, పెండ్యాల ఓదెలు, నర్సయ్య, లింగయ్య ఉన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జ్యోతినగర్: ప్రమాదాల నివారణకు రామగుండం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్, ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్ బి-గేట్ రాజీవ్ రహదారిపై డివైడర్ లేని చోట సిమెంట్ బ్లాక్స్ అమర్చారు. సర్వీసు రోడ్డు నుంచి నేరుగా రహదారిపైకి వెళ్లకుండా సిమెంట్ బ్లాక్స్ ఏర్పాటుతో పాటు వాటిని తొలగించకుండా తాడును కట్టి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

బీఎస్పీ ప్రచారం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో బహుజన రాజ్యస్థాపనకు వాడవాడలా గోలివాడ, బీఎస్పీ ప్రచారం ప్రారంభించారు. ఏనుగు గుర్తుకు ఓటు వేసి బీఎస్పీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ కాసిపేట స్వామి, గోదావరిఖని పట్టణ అధ్యక్షుడు సిరికొండ సది, నాయకులు జనగామ మల్లేశ్, గద్దల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా విజయమ్మ ఫౌండేషన్

జ్యోతినగర్: మహిళా సాధికారతకు విజయమ్మ ఫౌండేషన్ అండగా ఉందని మూడో డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో ఫౌండేషన్ ద్వారా 3నెలల పాటు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందించారు.

రాళ్లు తేలిన రహదారితో పాట్లు

- మరోవైపు రైల్వేగేటు
- అంతర్గత రహదారులు గుంతలమయం
- ఇదీ మల్యాలపల్లి దుస్థితి



కంకర తేలిన మల్యాలపల్లి ప్రధాన రహదారి

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన మల్యాలపల్లి ప్రజలు రామగుండం పట్టణానికి చేరుకునే రహదారి పూర్తిగా రాళ్లు తేలి ఉండడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. 30ఏళ్ల క్రితం నుంచి రామగుండం పట్టణంలోని బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం, ప్రతిపాదిత బీపీఎల్ విద్యుత్ కేంద్రం, ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం, బొగ్గు గనులకు వెళ్లేందుకు రైల్వే ట్రాక్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలకు మల్యాలపల్లి గ్రామం తమ భూములను అప్పగించింది. ప్రస్తుతం మల్యాలపల్లికి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవడంతో గ్రామ ప్రజలు వివిధ పరిశ్రమలలో కాంట్రాక్టు కార్మికులుగా చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారు.

రాళ్లు తేలిన రహదారి.. మరోవైపు రైల్వేగేటు

ప్రస్తుతం కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ ఏ డివిజన్‌కు సంబంధం లేకుండా ప్రత్యేక కుగ్రామంగా పూర్తిగా గ్రామాన్ని తలపిస్తోంది. గ్రామంలో గరిష్ఠంగా 300 గృహాలుండగా 1,700 జనాభా ఉంటుంది. వీరు పట్టణానికి చేరుకోవాలంటే ఒకవైపు రాళ్లు తేలిన రహదారి, మరోవైపు బొగ్గు గనులకు వెళ్లే రైల్వేట్రాక్ అడ్డుగా ఉండడంతో పాటు గ్రామంలో అంతర్గత రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారాయి. దీంతో బైక్‌లపై వెళ్లే క్రమంలో వాహనాలు అదుపు తప్పుతుండగా, పక్కనున్న వారిపై బండరాళ్లు పడుతున్నాయి.

బైక్‌లు పాడవుతున్నాయి



బైక్‌పై రామగుండం వచ్చే క్రమంలో రహదారి పూర్తిగా బండరాళ్లు తేలి ఉండడంతో వాహనం కుదుపులతో అదుపు తప్పుతోంది. పలువురు గాయాలపాలయ్యారు. రాత్రివేళల్లో ఓ వైపు బండరాళ్లు, మరోవైపు చిమ్మ చీకట్లతో ఇరువైపులా ముళ్లపొదలతో పరిస్థితి ప్రమాదకరంగా ఉంది.

– సిరిశెట్టి సతీశ్‌గౌడ్, గ్రామస్తుడు

అంతర్గత రోడ్లు శిథిలం



గ్రామంలో అంతర్గత రహదారులు పూర్తిగా గుంతలమయమై శిథిలమయ్యాయి. అసలే శిథిలమైన రహదారులతో మధ్యలో వాహనాల వేగం నియంత్రణకు ఏర్పాటు చేసిన బ్రేకర్లతో మరింత అసౌకర్యంగా మారింది. మున్సిపల్ పాలకవర్గం, ఎన్టీపీసీ యాజమాన్యం మా గ్రామంపై చిన్నచూపు చూస్తున్నారు. కనీసం రహదారుల అభివృద్ధికి నోచుకోకపోవడం దురదృష్టకరం.

– మహేశ్, గ్రామస్తుడు

ఎన్టీపీసీ దృష్టికి తీసుకెళ్లాం



గ్రామంలో అంతర్గత రోడ్లు, ఇరువైపులా ఉన్న ప్రధాన రోడ్లు శిథిలావస్థకు చేరాయి. ప్రభావిత గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎన్టీపీసీ యాజమాన్యాన్ని కలిసి, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరాం. ఎన్టీపీసీ యాజమాన్యం స్పందించి రోడ్ల నిర్మాణం, వీధి దీపాలు, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

– కన్నూరి సతీశ్‌కుమార్, కార్పొరేటర్

‘అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి’



చిన్నారితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేశానని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని కాసులపల్లి, పాలితం, తుర్కలమద్దికుంటలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో ప్రజలకు అవసరమైన కనీస మౌళిక వసతులను కల్పించానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పెద్దపల్లిలో ప్రచారం..

పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పురాజ్‌కుమార్, కౌన్సిలర్లు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరనున్న బీజేపీ నేత



సన్మానిస్తున్న సనత్‌కుమార్

మంథని: బీజేపీ మంథని నియోజకవర్గ నేత రేండ్ల సనత్‌కుమార్ త్వరలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు. బుధవారం హైదరాబాద్‌లో సనత్‌కుమార్ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు-శైలజ దంపతులను తన నివాసానికి ఆహ్వానించి సత్కరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సనత్‌కుమార్ 2018లో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. సనత్‌కుమార్ త్వరలో బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు సమాచారం.

దుర్గానగర్ లేఅవుట్ కాలనీ అధ్యక్షుడిగా బుచ్చిరెడ్డి



పందిళ్ల బుచ్చిరెడ్డి



రవీందర్‌రెడ్డి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని దుర్గానగర్ లేఅవుట్ కాలనీ నూతన కమిటీని బుధవారం ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడికి ఎన్నికలు నిర్వహించగా పోటీలో ఉన్న పందిళ్ల బుచ్చిరెడ్డికి, తూముల రాజేశ్వరరావుకు సమానంగా ఓట్లు రావడంతో రెండేళ్ల కాలపరిమితితో, ఒక్కొక్కరు ఏడాది చొప్పున అధ్యక్షుడిగా ఉండటానికి నిర్ణయించారు. మొదటి సంవత్సరం అధ్యక్షుడిగా పందిళ్ల బుచ్చిరెడ్డికి అవకాశం కల్పించారు. ఉపాధ్యక్షులుగా ఉమ్మెంతల దేవేందర్‌రెడ్డి, కరివేద సత్యనారాయణరెడ్డి, జనరల్ సెక్రటరీగా కంది రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా మోసం శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కె.ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గుర్రం శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా అనిల్ యాదవ్, ఎస్.మల్లేశ్, బి.సమ్మయ్య కార్యవర్గ సభ్యులుగా డి.నరేందర్, ఎ.రాజశేఖర్, లింగయ్య, కుమార్, రాజయ్య, తిరుపతి, జగదీష్, రవిగౌడ్, అంకూస్, వెంకటస్వామి, కరుణాకర్, సంతోష్‌రావును ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మంథని సంపత్, గౌరవ సలహాదారులుగా పీఎస్ అమరేందర్, జక్కుల నారాయణ, హరిప్రసాద్, దామోదరాచార్యులు, మల్లీశ్వర్‌రావు, వీరేశం, కొల్లూరి శ్రీనివాస్‌ను నియమించారు.

ఆలయానికి రథం బహూకరణ



సుల్తానాబాద్: సుల్తానాబాద్ శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి పల్లా కుటుంబ సభ్యులు రథం బహూకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళి తెలిపారు. కార్యక్రమంలో పూజారి శ్రవణ్‌కుమార్, పల్లా కుటుంబ సభ్యులు సురేశ్, వాసు, సంతోష్, అనిల్, శ్రీనివాస్ రామ్మూర్తి, ఉన్నారు.

బీజేపీలో చేరిన ఎన్నారై ఉదయ్‌యాదవ్



వివేక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉదయ్‌యాదవ్

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన ఎన్నారై ద్యాగేటి ఉదయ్‌యాదవ్ మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వివేక్ సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు. ఉదయ్‌యాదవ్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయానికి తరలివెళ్లి వివేక్ సమక్షంలో పార్టీలో చేరారు. బీజేపీ దళితమోర్చా అధికార ప్రతినిధి కాడె సూర్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మెడవేని శ్రీనివాస్, కిసాన్‌మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి తీగుళ్ల సతీశ్‌రెడ్డి, మండల నాయకులు గుమ్ముల తిరుపతి, దేవి రజనీకాంత్, పెరుమాండ్ల ప్రసాద్, ఎల్లాల మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ శాసనసభ ఎన్నికల్లో బీజేపీదే విజయం

పెద్దపల్లిరూరల్: నవంబర్30న జరిగే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం నీతివంతమైన పాలన అందిస్తోందని ప్రజలంతా విశ్వసిస్తున్నారన్నారు.

✦ వాట్సాప్‌లో అనుచిత పోస్టుపై ఫిర్యాదు

సుల్తానాబాద్‌రూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిపై వాట్సాప్ గ్రూపులో అనుచిత పోస్టు పెట్టారని బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లికి చెందిన యువకులు గ్రామ వాట్సాప్ గ్రూపులో అనుచిత పోస్టు పెట్టారని బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. యువకులను అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు అనంతరం మందలించి వదిలేసినట్లు ఎస్సై విజేందర్ తెలిపారు.

✦ రైతుబంధు జిల్లా సభ్యుడికి పరామర్శ

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ రైతుబంధు జిల్లా సభ్యుడు ఎగ్గెల స్వామి తల్లి మరణించింది. బుధవారం సాయంత్రం మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.

✦ అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి శివారులోని ప్రభుత్వ భూమిలోంచి బుధవారం కొందరు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు వెళ్లగా వాహనాలతో పరారయ్యారని ఆర్‌ఐ శ్రీవాణి తెలిపారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

మహిళల భద్రత.. షీటీం బాధ్యత

జ్యోతినగర్: మహిళల భద్రత.. షీటీం బాధ్యత అని పెద్దపల్లి జిల్లా షీటీం బాధ్యులు ఎస్సై రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని ట్రినిటీ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాట్సాప్ నంబర్ 63039 23700కు సమాచారం అందించాలని సూచించారు. ఏఎస్సై మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ యుగందర్ పాల్గొన్నారు.

✦ ఇంటింటికీ కాంగ్రెస్

రామగుండం: కాంగ్రెస్ గ్యారెంటీ పథకాల గురించి పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. బుధవారం అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి కోల రామ్మూర్తిగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ ప్రతినిధులు బర్పటి తిరుపతి, అయిడపు తిరుపతి, కందుల రామస్వామి, తూడూరి అజయ్, బర్పటి నవీన్, జంబోజు శ్యాం, తీగుట్ల లింగయ్య, కందుల రవి, నూనె వెంకటి ఉన్నారు.

✦ మహాసభ విజయవంతం చేయండి

మంథని: హైదరాబాద్‌లో 23న జరిగే మాదిగల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొంద్ర శంకర్ కోరారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పేరుకు నవీన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నూరి బాబు, మండల అధ్యక్షుడు కొయ్యల మొండి ఉన్నారు.

✦ ఇంటింటికీ సంక్షేమ పథకాలు

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయని మున్సిపల్ కౌన్సిలర్ పసెడ్ల మమత అన్నారు. సుల్తానాబాద్‌లోని సుగ్లాంపల్లిలో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కౌన్సిలర్లు శ్రీనివాస్, గోపి ఉన్నారు.

కారు గుర్తుకు ఓటు వేయాలి



పెద్దపల్లిరూరల్: ‘అవ్వ.. ఈ కారు గుర్తు కనిపిస్తోందా.. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తు బొమ్మపై ఓటు వేసి మరోసారి ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డినే ఎన్నుకోవాలి’ అంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి కోరారు. పట్టణంలోని ఒకటో వార్డులో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓ వృద్ధురాలికి ఇలా కండువాపై ఉన్న కారు బొమ్మను చూపించి ఓటు వేయాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్ సభ విజయవంతం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సదానందం

ముత్తారం: కాంగ్రెస్ ప్రవేశపెట్టిన మెనిఫెస్టోలోని ఆరు గ్యారంటీ పథకాల ప్రచారం గురువారం ముత్తారంలో ప్రారంభమవుతుందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ మెనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరవుతారన్నారు. ముత్తారం నుంచి మచ్చుపేటకు గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తామన్నారు. తర్వాత మచ్చుపేటలో కాంగ్రెస్ బహిరంగ సభ జరుగుతుందనని పేర్కొన్నారు. బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. నాయకులు తూటి రఫీ, గాదం శ్రీను, మద్దెల రాజయ్య, వజీద్ పాషా, అల్లం కుమారస్వామి, ఆనంద్, రాజేందర్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమనాయక్

రామగిరి: మంథని నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆర్డీవో హనుమ నాయక్ ఆదేశించారు. బుధవారం స్థానిక జేఎన్టీయూ కళాశాలలో పెద్దపల్లి, భూపాల్‌పల్లికి రాజకీయ పార్టీల నాయకులతో, ఎన్నికల పర్యవేక్షణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు జరగాలని, ప్రతి అంశం ఎన్నికల నిబంధనలకు లోబడి ఉంటుందన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్నిశాఖల అదికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎక్కడా చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వొద్దన్నారు. వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులు, ఎన్నికల పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

ఎలిగేడు: మహబూబ్‌నగర్ జిల్లాలో 15, 16, 17వ తేదీల్లో జరగనున్న డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పిడి సంతోష్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో బుధవారం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీఏ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎలిగేడు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం దేవేందర్‌రావు, పీఎస్‌హెచ్‌ఎం జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జ్యోతినగర్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్య, వైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో జోన్ కన్వీనర్ బోయిని కిరణ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్‌చారి, రమేశ్, రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష



బజ్జీలు వేస్తున్న దాసరి పుష్పలత

ఓదెల: మహిళా సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష అని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సతీమణి పుష్పలత అన్నారు. గురువారం ఓదెలలో ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం ఆమె మట్లాడుతూ కేసీఆర్ మహిళలకు కల్యాణలక్ష్మి, ఆరోగ్యశ్రీ, కేసీఆర్ కిట్, అందుబాటులో ప్రసూతి లాంటి పథకాలను ప్రవేశపెట్టారని అన్నరు. ఎంపీపీ కునారపు రేణుకదేవి, ఎంపీటీసీ బోడకుంట చిన్నస్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు పోలోజు రమేశ్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, నాయకులు డాక్టర్ సతీశ్, చింతం మొగిలి, వెంకటస్వామి, బుద్దె పోశెట్టి పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత



టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆడపిల్లల రక్షణ మనందరి బాధ్యత అని జామీత్ ఇస్లామీ హిందు గోదావరిఖని శాఖ ఉపాధ్యక్షుడు ఇస్మాయిలు అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జామీత్ ఇస్లామీ హిందు ఆధ్వర్యంలో స్థానిక స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆడపిల్లలు సమస్యల నుంచి ఎలా రక్షణ పొందాలనే విషయలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టీఎంఆర్‌ఈఐఎస్ కౌన్సిల్ క్యాజీ ముహ్మద్ ఇస్మాయిలు, జీఐవో సెక్రటరీ అదియా షగిఫ్తా, పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌రావు, కరస్పాండెంట్ ఓదెలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రి జూనియర్ కాలేజీలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. పెద్దపెల్లి చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఉమాదేవి, చైల్డ్ హెల్ప్‌లైన్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కాపులపల్లికి చెందిన పలువురు నాయకులు బుధవారం విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సందవేని రమేశ్, చంద్రశేఖర్, అజయ్, రాయలింగు, సంతోష్, మారుతి, శశికుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీటీసీ ఎడెల్లి శంకర్, బండ శ్రీను ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే సమక్షంలో..

ఎలిగేడు: సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లి బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు జూపల్లి తిరుమల్‌రావు బుధవారం మండలంలోని శివుపల్లిలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ నాయకులు ప్రకాష్‌రావు, మహేందర్, సంతోష్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ దోపిడీ ప్రభుత్వాలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దాసరి ఉష

ఓదెల: బీజేపీ, బీఆర్‌ఎస్ దోపిడీ ప్రభుత్వాలని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. బుధవారం మండలంలోని రూపునారాయణపేటలో బీఎస్పీ మన ఊరు మన ఉష ప్రచార కార్యక్రమం జరిగింది. గ్రామంలోని నాంపల్లి రామారావు, బాపురావు, చెలిక విజేందర్, అడ్డా బాపురావు, ఆరెల్లి రాజు, గాజుల గట్టయ్య, గొండె రాజేశ్వర్‌రావు పార్టీలో చేరారు. బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి ఎండీ రియాజ్, మండల నాయకులు మహేశ్, నవీన్, బీరం రవి, బోయ సది, వెంకటేశ్, కృష్ణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

బీసీలను ఆదరించాలి

సుల్తానాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలను ఆదరించి దీవించాలని బీఎస్పీ అసెంబ్లీ అభ్యర్థి దాసరి ఉష కోరారు. సుల్తానాబాద్ బీఎస్పీ కార్యాలయంలో బుధవారం మండలంలోని కదంబాపూర్, ఐతరాజ్‌పల్లి, మంచిరామి గ్రామాల నుంచి దాదాపు 500 మంది బీఎస్పీలో చేరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, మండల కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు తోట మధు, రోహిత్, అనిల్ పాల్గొన్నారు.

శరీరదానానికి అంగీకారం

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన కొంగర జిజియారాణి అనే సింగరేణి మాజీ ఉద్యోగురాలు తన మరణానంతరం నేత్ర, అవయవ, శరీరదానం చేస్తానని అంగీకారం తెలిపారు. ఈ మేరకు బుధవారం సదాశయ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు రాజమౌళి, ప్రతినిధులు కేఎస్.వాసు, దబ్బెట శంకర్ అంగీకార పత్రాలు అందజేశారు. జిజియారాణిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్, కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, జిల్లా అధ్యక్షుడు మేర్గ భీష్మాచారి, ప్రతినిధులు నూక రమేశ్, అన్నపూర్ణ, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.